

ప్రత్యేక అలంకారణలో ఉత్సవ మూర్తులు

రథోత్సవంలో పోటెత్తిన భక్తులు

నేత్రపర్వంగా నరసింహస్వామి రథోత్సవం

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లోని పురాతనమైన పార్థసారథి స్వామి ఆలయ ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరిన నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ ఉత్సవంలో రాష్ట్రప్రభుత్వ హిందూ దేవాదాయశాఖ అధికారులు, పలు హిందూ సంస్థల గురువులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఘన చరిత్రను కలిగిన ట్రిప్లికేన్ పార్థసారధిస్వామి ఆలయ ప్రాంగణంలో నరసింహస్వామివారికి ప్రత్యేక సన్నిధిలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారికి ధ్వజారోహణంతో 10 రోజుల బ్రహ్మోత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ప్రధానమైన రథోత్సవం సందర్భంగా నరసింహ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. ఉదయం 7 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రవేశద్వారం నుంచి ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 200 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, రథోత్సవం సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీ గొంతుకగా ఈపీఎస్

● తిరువారూర్‌లో సీఎం స్టాలిన్ ధ్వజం

కమ్యూనిటీ హాస్టల్ పరిశీలన

తిరువారూర్‌లో ప్రభుత్వ కళాశాల కమ్యూనిటీ హాస్టల్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం పరిశీలించారు. ఆ భవనంలో కల్పించిన తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు కొరతలేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరీక్షల సీజన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని హాస్టల్ అధికారులకు సీఎం సూచించారు.



కమ్యూనిటీ హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న స్టాలిన్

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మతవాద బీజేపీ గొంతుకగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. రెండ్రోజుల తిరువారూర్ జిల్లా పర్యటనకు వెళ్ళిన స్టాలిన్ బుధవారం పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం తిరువారూర్ కొత్త బస్‌స్టేషన్ సమీపంలోని ఎంఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.73.74 కోట్ల తో పూర్తిచేసిన 1,234 పథకాలను ప్రారంభించి, రూ.172.18 కోట్ల 2,423 కొత్తపథకాలకు శంకుస్థాపన చేశారు. తిరువారూర్ జిల్లాలో గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థలశాఖ ఆధ్వర్యంలో పలు భవనాలు, కార్యాలయాలు నిర్మించారు. అలాగే రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తిరుత్తురైపూండి ప్రభుత్వాసుపత్రిలో రూ.9 కోట్లతో నిర్మించిన అదనపు భవనం, మన్నార్గుడి ప్రభుత్వాసుపత్రిలో రూ.1.25 కోట్లతో నిర్మించిన జిల్లా ప్రజా ఆరోగ్యవైద్య ప్రయోగశాల, విజయపురం ప్రభుత్వ తల్లిశిశు సంక్షేమ ఆస్పత్రిలో రూ.6 కోట్లతో నిర్మించిన కొత్త వార్డులు, పలు ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, నగరాభివృద్ధి కార్యాలయం, పాఠశాల విద్యాశాఖ, పశు సంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ, అటవీశాఖల ఆధ్వర్యంలో పూర్తిచేసిన కొత్తపథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీర్ సెల్వం, చెళియన్, అన్బిల్ మహేష్, మెయ్యనాథన్, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ... స్వలాభాపేక్షతో పార్టీని ఈపీఎస్ బీజేపీకి తాకట్టుపెట్టారని, ఆయన రాష్ట్రాన్ని కాపాడుతానని ప్రజలకు హామీ ఇవ్వడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. దేవాదాయశాఖ నిధులను పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణానికి మళ్లించడంపై ఈపీఎస్ ప్రభుత్వాన్ని తప్పుబట్టారని, బీజేపీ కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయరన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదివరకు లేనివిధంగా డీఎంకే ప్రభుత్వంలో హిందూదేవాదాయశాఖ వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని, వీటి గురించి ప్రస్తావించని ఈపీఎస్ ప్రజలను మభ్యపెట్టేవిధంగా కోవై పర్యటనలో మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించని అన్నాడీఎంకేకు ప్రజలే గుణపాఠం చెబుతారని సీఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

ముందు మీ అవినీతి గురించి చెప్పండి

● స్టాలిన్‌కు ఈపీఎస్ కౌంటర్

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రౌడీయిజం, దౌర్జన్యం, హత్యలు, దోపిడీలు, మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా జగుతోందని, 'కమీషన్, కరప్షన్ నిర్విఘ్నంగా సాగుతోందని అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. ఆ విషయాన్ని వదిలేసి కల్లబొల్లి మాటలు చెబితే లాభం లేదని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఎద్దేవా చేశారు. గురువారం సేలం ముత్తుమలై కొండ శిఖరంపై ఉన్న సుబ్రమణ్యస్వామిని ఈపీఎస్ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రసాదాలందించారు. స్వామివారిని దర్శించిన అనంతరం అన్నాడీఎంకే జిల్లా స్థాయి ప్రచారం విజయవంతం కావాలని, రాష్ట్రంలో మళ్ళీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటూ వెండి ఖడ్గాన్ని ఈపీఎస్ బహూకరించారు. ఈ ఆలయం ప్రాంగణం నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తూ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల పదవులను డీఎంకే కుటుంబ సభ్యులకే కట్టబెట్టారని ఈపీఎస్ ఆరోపించారు. మదురై కార్పొరేషన్‌లో జరిగిన రూ.200 కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మదురై కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలో మిగతా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కూడా అవినీతి జరగడం వల్లే కోవై, తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్లు రాజీనామా చేసిన వాస్తవాన్ని ప్రజలకు తన పర్యటనలో వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈపీఎస్‌తో వెంట మాజీమంత్రి డాక్టర్ సి.విజయ భాస్కర్, వీరపాండి ఎమ్మెల్యే ముత్తురాజా తదితరులు ఉన్నారు.



వెండి ఖడ్గంతో ఈపీఎస్

మీరే రాయబారులు



లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

సంక్షేమాల లబ్ధిదారులకు ఉదయనిధి పిలుపు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న వారు రాయబారులుగా పనిచేసి, ప్రభుత్వానికి మద్దతుగా నిలివాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. నామక్కల్‌లో ప్రభుత్వ పథకాల పంపిణీ, పూర్తయిన పథకాల ప్రారంభోత్సవం గురువారం జిల్లా కలెక్టర్ దుర్గామూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి, వివిధ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రూ.131.36 కోట్ల సంక్షేమ పథకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యలు చేపట్టిన వెంటనే, బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే పథకంపై తొలి సంతకం చేశారన్నారు. ఉదయం అల్పాహారం పథకంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజు 20 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. క సంక్షేమ సహాయాలు పొందిన మహిళలు రాయబారులుగా ఉంటూ, ప్రభుత్వానికి అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్.రాజేంద్రన్, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి ఎం.మదివేందన్, ఎంపీ కేఆర్ఎన్ రాజేష్‌కుమార్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడలూరు రైలు ప్రమాదం ఎఫెక్ట్!

లెవల్ క్రాసింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు

● ఇంటర్ లాకింగ్ సిస్టం ఏర్పాటు



చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని లెవల్ క్రాసింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. కడలూరు సమీపంలో లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే గేటు వేయని కారణంగా, రైలు పట్టాలు దాటేందుకు యత్నించిన పాఠశాల బస్సును రైలు ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై స్పందించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, అన్ని రైలు మార్గాల్లో లెవల్ క్రాసింగ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, ఇంటర్ లాకింగ్ వ్యవస్థ విస్తరించాలని ఆదేశించారు. అన్ని లెవల్ క్రాసింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో సోలార్ ప్యానళ్లు, బ్యాటరీ రీచార్జ్, విద్యుత్ అందించనున్నామని తెలిపారు. ఇంటర్ లాకింగ్ వ్యవస్థ కూడా విస్తరించాలని నిర్ణయంచామన్నారు. ప్రస్తుతం ఇంటర్ లాకింగ్ లేని లెవల్ క్రాసింగ్‌లపై స్టేషన్ మాస్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో గేటు మూయక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇంటర్‌లాకింగ్ ఏర్పాటుతో గేటు మూసిన తర్వాతే గ్రీన్‌లైట్ వెలుగుతుందని తెలిపారు. అలాగే, ఇంటర్ లాకింగ్ లేని లెవల్ క్రాసింగ్ వద్ద సైరన్ ఏర్పాటు చేయన్నామన్నారు. రైల్వే, స్థానిక పోలీసులతో లెవల్ క్రాసింగ్ వద్ద భద్రత ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, లెవల్ క్రాసింగ్ ప్రమాదాలు అడ్డుకొనేలా ఆయా ప్రాంతాల్లో హై లెవల్ వంతెన, సబ్ వే ఏర్పాటుచేసేందుకు భూసేకరణ, నిర్మాణాలు, నిధుల కొరత తదితర సమస్యలు ఉంటున్నాయన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రమాదాలు పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుతం 1,643 లెవల్ క్రాసింగ్‌లు ఉండగా, 276 ప్రాంతాల్లో ఇంటర్‌లాకింగ్ అందుబాటులో ఉందని వివరించారు.

హైకమాండ్ అనుమతి లేకుండా
ఏదీ అడగలేం

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వ పెరుంతగై



అడయార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తమ హైకమాండ్ అనుమతి లేకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎక్కువ సీట్లు కోరలేమని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అన్నారు. రాయపేటలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ సమాయాత్తమవుతోందన్నారు. ఇందులోభాగంగా గ్రామ కమిటీ శిక్షణ ప్రధాన నిర్వాహకులుగా వంద మందిని ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరు రాష్ట్రంలోని 12,525 పంచాయతీల్లో ఉన్న నిర్వాహకులకు శిక్షణ ఇస్తారన్నారు. అలాగే, గ్రామ కమిటీ సభ్యుల ఎంపిక 72 శాతం మేరకు పూర్తయిందన్నారు. అలాగే, గ్రామ కమిటీ సభ్యులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్ అధిక సీట్లను కోరే విషయంలో ఏమాత్రం వెనుకంజ వేయడం లేదన్నారు. అయితే, అధిక సీట్లను కోరడం అనేది తమ పార్టీ అగ్రనాయకత్వం అనుమతి మేరకే జరుగుతుందన్నారు. అదేసమయంలో రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉందన్న విషయాన్ని, కార్యకర్తల మనోభావాలను హైకాండ్‌కు తెలియజేస్తామన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత హయాంలోనే ఆలయ నిధులతో విద్యా సంస్థలను స్థాపించగా, ఇపుడు మంత్రి శేఖర్‌బాబు దాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అన్నాడీఎంకే ద్రావిడ పార్టీ కాదన్నారు. జయలలితను కించపరిచేలా మాట్లాడిన వారితో ఆ పార్టీ పొత్తు పెట్టుకుందని ఆయన ఆరోపించారు.

హైకోర్టుకు ఐదుగురు ఐఏఎస్‌లు

● ఒకేసారి సీనియర్ అధికారుల రాకతో కలకలం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ కోర్టు ధిక్కార కేసుకు సంబంధించి ఏకంగా ఐదుగురు సీనియర్ ఐఏఎస్‌లు హైకోర్టు హాజరయ్యారు. ఒకేసారి ఇంతమంది ఐఏఎస్‌లు న్యాయస్థానం ముందు హాజరు కావడం ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కడలూరు జిల్లా కూత్తపాక్కం గ్రామంలోని దేవనాథస్వామి ఆలయానికి చెందిన 3.40 ఎకరాలో ఉన్న ప్రైవేటు పాఠశాల (సెయింట్ జోసఫ్ మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల)ను తొలగించాలని కోరుతూ బీజేపీ నేత వినోద్ రాఘవేంద్రన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, పాఠశాలను తొలగించి, ఆ స్థలాన్ని ఆలయానికి అప్పగించాలని, పాఠశాలకు ప్రత్యామ్నాయ స్థలం చూపాలని 2024లో ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈ ఉత్తర్వులు అమలుకాలేదని పేర్కొంటూ, రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి అముద, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మధుమతి, హిందూ దేవాదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కడలూరు జిల్లా కలెక్టర్ సీబీ ఆదిత్య సెంథిల్‌కుమార్, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ భరణీధరన్, ఆలయ కార్యనిర్వాహక అధికారి వెంకటకృష్ణన్‌లపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ సుందర్‌మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. ఐదుగురు ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ అధికారులు నేరుగా హాజరై సంజాయిషీ తెలపాలని ఆదేశించింది. దీంతో రెవెన్యూ కార్యదర్శి అముద, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మధుమతి, దేవాదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్, ఆ శాఖ కమిషనర్ శ్రీధర్, కడలూరు కలెక్టర్ ఎస్పీ ఆదిత్య సెంథిల్ కుమార్, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ భరణీధరన్, ఆలయ కార్యనిర్వాహక అధికారి వెంకటకృష్ణన్ గురువారం కోర్టుకు హాజరై, కోర్టు ఆదేశాలు అమలుచేయనందుకు క్షమించాలని పిటిషన్లు వేశారు. భువనగిరి తాలూకా పెరియపట్టు గ్రామంలో పాఠశాలకు 4.73 ఎకరాల స్థలం కేటాయించినట్లు అదనపు అడ్వకేట్ జనరల్ జె.రవీంద్రన్ తెలిపారు. అదే సమయంలో, 32 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో రోడ్డు సదుపాయం లేదని పాఠశాల యాజమాన్యం తరపున ఆక్షేపణ తెలియడంతో పాటు, కడలూరు నగరం పరిధిలోని 5 కి.మీ దూరంలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ప్రభుత్వం తరపున హాజరైన అడ్వకేట్ జనరల్.. ప్రధాన రోడ్డు నుంచి నిర్దేశిత ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఇరువర్గాల వాదనల అనంతరం.. వేరే స్థలం కోసం ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని పాఠశాల యాజమాన్యానికి సూచిస్తూ, ఈ వినతిని సాధ్యమైనంత త్వరగా పరిశీలించి, పరిష్కారం చూపాలని రెవెన్యూ శాఖ కార్యదర్శిని ఆదేశించింది. అంతేగాక అధికారుల క్షమాపణను ఆమోదిస్తూ.. కోర్టు ఉత్తర్వుల ధిక్కార పిటిషన్‌ను ముగిసినట్లు ప్రకటించింది.



తిరుచెందూర్‌లో వందడుగులు వెనక్కివెళ్లిన సముద్రం



పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో సముద్రం వందడుగులకు వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన రాళ్లు, సముద్రపు జీవులు బయటపడ్డాయి. సునామీ సంభవించినప్పటి నుంచి పౌర్ణమి ముందు, తర్వాత రోజుల్లో తిరుచెందూర్‌లో సముద్రం వెనక్కి వెళ్లడం కొనసాగుతోంది. ఆ ప్రకారం, పౌర్ణమి రోజైన గురువారం సముద్రం వందడుగుల వెనక్కి వెళ్లింది. సముద్రం వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన రాళ్లు, సముద్రపు జీవులు బయటపడ్డాయి. అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న భక్తులు రాళ్లపై నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సముద్రం యధాస్థితికి చేరుకుంది.

పరమేశ్వరుడు కొలువైన పర్వతాలయం..

ముక్తినిచ్చే శైవక్షేత్రం

- 7లో -

నా పేరు వాడొద్దు... కావాలంటే ఇనిషియల్ వాడుకో..!

● అన్బుమణికి రాందాస్ అల్టిమేటం



పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ - ఆయన కుమారుడు అన్బుమణి మధ్య నెలకొన్న రాజకీయ యుద్ధం తారస్థాయికి చేరింది. ఇది వ్యక్తిగత సంబంధాలపైనా ప్రభావం చూపుతోంది. ఇప్పటికే అన్బుమణిని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించిన రాందాస్.. ఇకనుంచి తన పేరు వాడకూడదని, కావాలనుకుంటే ఇనిషియల్ మాత్రం వాడుకోవచ్చని అల్టిమేటం ఇచ్చారు. గురువారం తంజావూరు జిల్లా కుంభకోణంలో జరిగిన జరిగిన పీఎంకే, వన్నియర్ సంఘం సర్వసభ్య మండలి సమావేశంలో పాల్గొన్న రాందాస్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవచేయడమే కర్తవ్యమని కార్యకర్తలను శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తాను వృద్ధాప్యంతో ఐదేళ్ల బాలుడిలా వ్యవహరిస్తున్నానంటూ ఇటీవల ఒకరు తన గురించి వ్యాఖ్యానించారని పరోక్షంగా అన్బుమణి విమర్శను గుర్తు చేస్తూ.. 'ఈ ఐదేళ్ల బాలుడే కదా నిన్ను మూడేళ్ల క్రితం పార్టీ అధ్యక్ష పదవిపై కూర్చోబెట్టింది?' అని నిలదీశారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని రాందాస్ పిలుపునిచ్చారు.

సమాచార దృష్టి

ఉప వైద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉప వైద్య డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సుల అడ్మిషన్లకు బుధవారం నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. ఆప్టోమెట్రీ, ఫార్మకోలజీ సహా 8 రకాల ఫార్మా కోర్సులు, 13 రకాల సర్టిఫికెట్ కోర్సుల అడ్మిషన్లకు ఆసక్తి కలిగిన వారు tnmedicalselection.org అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాది, రెండేళ్లు, ఆరు నెలలు కోర్సులు అందుబాటులో ఉన్నాయని వైద్య విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి, టి.నగర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమావేశం జరుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. వ్యాసర్పాడి రామలింగం ఆలయం ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, టి.నగర్ పరిధిలో కోడంబాక్కం హైరోడ్డు వళ్లువర్‌కోట్టం సమీపంలో సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే శిబిరంలో, ఆయా ప్రాంతాల వినియోగదారులు పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని ఈబీ తెలియజేసింది.

రూ.15 కోట్లతో అన్నానగర్ లైబ్రరీ ఆధునికీకరణ

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ ఈస్ట్ 6వ అవెన్యూలో ఉన్న లైబ్రరీని రూ.15.50 కోట్లతో ఆధునికీకరించనున్నారు. 40 ఏళ్లుగా నడుస్తున్న ఈ లైబ్రరీ భవనం శిధిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో, పాత భవనం కూల్చివేసి మూడంతస్తుల లైబ్రరీ నిర్మాణపనులు బుధవారం ప్రారంభమయ్యాయని సీఎండీఏ తెలియజేసింది.

1,996 పీజీ టీచర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,996 పోస్ట్ గ్యాడ్యుయేట్ టీచర్ పోస్టుల భర్తీకి గురువారం నుంచి ఆగస్టు 12వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) ప్రకటన విడుదల చేసింది. పోస్ట్ గ్యాడ్యుయేట్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లెవల్-1, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ లెవల్-1 తదితర పోస్టులకు నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. సబ్జెక్ట్‌ల వారీగా ఖాళీల వివరాలు, విద్యార్హత, వయస్సు, దరఖాస్తు చేసుకునే విధానం తదితరాలకు https://www.trb.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. నోటిఫికేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులను trbgrievances@tngov.in అనే ఈ-మెయిల్ చిరునామాకు పంపించాలని టీఆర్బీ తెలియజేసింది.

తగ్గిన చిన్న ఉల్లి దిగుబడి.. పెరిగిన ధరలు

అడయార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో చిన్న ఉల్లి (సాంబార్ ఉల్లిపాయలు) ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ మార్కెట్‌లోనే కేజీ ఉల్లిపాయల ధర రూ.100గా పలుకుతోంది. సాధారణంగా ఈ మార్కెట్‌కు పెరంబలూరు, రాశీపురం, కోయంబత్తూరు, సేలం, తెన్‌కాశితో పాటు పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి కూడా ఉల్లిపాయలతో పాటు ఇతర కూరగాయలు వస్తుంటాయి. అయితే, దక్షిణాది జిల్లాలతో పాటు కర్ణాటకలో కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ రకం ఉల్లిపాయల దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో కేజీ ఉల్లిపాయలు ధర హోల్ సేల్‌లో రూ.50 నుంచి రూ.70 పలుకుతుండగా, చిల్లరగా రూ.100 వరకు విక్రయిస్తున్నారు. నాసిక్ రకం పెద్ద ఉల్లిపాయలు కేజీ రూ.20 ధర పలుకుతుండగా, చిల్లరగా రూ.30కు వరకు పలుకుతున్నాయి.

గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

● తిరువణ్ణామలైలో పౌర్ణమి పూజలు

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో వ్యాసపూర్ణిమ సందర్భంగా గురువారం లక్షలాది మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. ఉన్నామలై సమేత అన్నామలైయార్ కొలువుదీరిన ఈ ఆలయంలో ఆణి పౌర్ణమి సందర్భంగా భక్తులు క్యూలైన్లలో 6గంటల పాటు వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గురువారం తెల్లవారుజామున 2.33గంటల నుంచి శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులను రాత్రి 10 గంటల వరకు దర్శనానికి విరామం లేకుండా అనుమతించారు.

రాష్ట్రంలో మరో మూడు మార్గాల్లో హైస్పీడ్ రైలు

● సాధ్యాసాధ్యాలపై పరిశీలనకు టెండర్లు

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంటకు 160 కి.మీ వేగంతో హై స్పీడ్ రైలు సేవలు త్వరలో రానున్నాయి. చెన్నై-చెంగల్పట్టు-దిండివనం, విల్లుపరం వరకు 167 కి.మీ, చెన్నై-కాంచీపురం-వేలూరు వరకు 140 కి.మీ, కోవై-తిరుప్పూర్-ఈరోడ్-సేలం వరకు 185 కి.మీ వేగంతో నడిపేలా సాధ్యాసాధ్యాలపై పరిశీలన చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) చేపడుతుందని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో, 'రీజినల్ రాపిడ్ ట్రానిస్ట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్)తో సెమి హైస్పీడ్ రైళ్లు నడిపేందుకు అవసరమైన సాధ్యాసాధ్యాల పరిశీలనకు సీఎంఆర్ఎల్ టెండర్లు విడుదల చేసింది. నివేదిక అనంతరం రైలు మార్గాల్లో చేపట్టాల్సిన మార్పులను రాష్ట్ర ప్రభుత్వానికి సీఎంఆర్ఎల్ నివేదించనుంది. ప్రభుత్వ అనుమతితో ప్రపంచ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఈ పథకం ప్రారంభించనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

ఘనంగా శ్రీమన్నారాయణ ఆలయ జీర్ణోద్ధరణ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న అర్చకులు, ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కేజీ కండ్రిగైలో కొలువైన శ్రీ దేవి,భూదేవి సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో గురువారం ప్రత్యేక హోమాలు జరిగాయి. అర్చకులు ఆలయంలో అభిషేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎన్నూరులో వైద్య కేంద్రం, మొబైల్ యూనిట్



ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆవడి పోలీసు కమిషనర్

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తిరువళ్లూరు జిల్లా ఎన్నూరులో ప్రాథమిక వైద్య కేంద్రం ఏర్పాటైంది. అదే విధంగా అత్యవసర ఆరోగ్య సేవల కోసం మొబైల్ మెడికల్ యూనిట్ కూడా ఏర్పాటైంది. ఆవడి పోలీస్ కమిషనర్ కె.శంకర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎండీ, సీఈవో ఎస్.శంకరసుబ్రమణియన్ ఈ కేంద్రాలను బుధవారం లాంఛనంగా ప్రాంభించారు. ఈ సందర్భంగా శంకరసుబ్రమణియన్ మాట్లాడుతూ.. తమ సంస్థ సమష్టి బాధ్యత, నిరంతర నిబద్ధతతో సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తోందన్నారు. ఈ వైద్యకేంద్రం, మొబైల్ హెల్త్ యూనిట్ ఎన్నూరులో ఆరోగ్య సంరక్షణ అందుబాటులో అంతరాన్ని తగ్గించడానికి దోహదపడతాయని తెలిపారు.

తిరుత్తణి రైల్వేస్టేషన్‌లో త్వరితగతిన పనులు పూర్తిచేయండి



సమావేశంలో తిరుత్తణి రైల్వేస్టేషన్ ఉద్యోగులు

తిరుత్తణి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సమావేశంలో కోరారు. రైల్వేస్టేషన్ పరిశుభ్రత, తాగునీరు వసతి తదితర విషయాలపై గురువారం ఉదయం తిరుత్తణి రైల్వేస్టేషన్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుత్తణి మీదుగా విజయవాడకు వెళుతున్న వందేభారత్ రైలును తమ స్టేషన్‌లో స్టాపింగ్‌కు అనుమతి తీసుకురావడం తదితర విషయాలపై చర్చించారు. సుమారు 3 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ, తిరుత్తణి స్టేషన్ ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించామని, త్వరలోనే సుందరమైన ప్రవేశద్వార నిర్మాణ పనులు మొదలుకానున్నాయని తెలిపారు. అదేవిధంగా ఎస్కలేటర్ పనులు కూడా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు మురుగన్ ఆలయానికి వచ్చే భక్తుల కోసం వందేభారత్ రైలును తిరుత్తణిలో కూడా ఆపే విధంగా రైల్వే అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ ఉద్యోగుల ఎన్వీ రమేష్, పి.భాస్కర్, ఎంఎల్.శంకర్, వీపీ గణేశన్ తదితరుల పాల్గొన్నారు.

● టోల్ ఛార్జీల వ్యవహారం...

ప్రభుత్వ బస్సులపై నిషేధం నిలిపివేత

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాలుగు టోల్ గేట్ల ద్వారా రాష్ట్ర రవాణా సంస్థ బస్సులను అనుమతించరాదనే ఉత్తర్వులను ఈనెల 31వరకు నిలిపివేస్తున్నట్టు మద్రాస్ హైకోర్టు ప్రకటించింది. రాష్ట్ర రవాణా సంస్థ టోల్ గేట్లకు రూ.276 కోట్లు బకాయిలు ఉంచినట్లు మదురై కప్పలూరు, సాత్తూర్ ఎట్టూర్‌వట్టం, కయత్తారు సాలైపుదూర్, నాంగునేరి టోల్ గేట్లు నిర్వహిస్తున్న సంస్థలు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశాయి. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, టోల్ ఛార్జీ బకాయిలు చెల్లించేందుకు రాష్ట్ర రవాణా సంస్థ నిర్లక్ష్యం చూపుతోందని, అందువల్ల దక్షిణ జిల్లాల్లో ఉన్న 4 టోల్ గేట్లలో గురువారం నుంచి ప్రభుత్వ బస్సులు అనుమతించరాదంటూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, టోల్ బకాయిల చెల్లింపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని, ఈ కేసు మళ్లీ విచారించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ రవీంద్రన్ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు న్యాయమూర్తి గురువారం మళ్లీ కేసు విచారించారు. అనంతరం నాలుగు టోల్‌గేట్లలో ప్రభుత్వ బస్సులను అనుమతించారాదనే ఉత్తర్వులు ఈ నెల 31వ తేది వరకు నిలిపివేస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, నాలుగు టోల్‌గేట్లలో గురువారం యధావిధిగా ప్రభుత్వ బస్సులు వెళ్లాయి.

జాలర్లపై వివక్ష తగదు

● రాయితీ నగదు ఇవ్వకుంటే భారీ ఆందోళన

● డీఎంకే సర్కారుకు టీవీకే హెచ్చరిక

అడయార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జాలర్లపట్ల వివక్ష చూపరాదని, ప్రభుత్వం ఇచ్చే సబ్సీడీని పార్టీలకతీతంగా జాలర్లందరికీ ఇవ్వాలని టీవీకే అధినేత విజయ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాకాకుండా జాలర్లను పార్టీల పరంగా చేసి సంక్షేమ పథకాలను దూరం చేస్తే మాత్రం సహించే ప్రసక్తే లేదని, ఈ అంశంపై ఆందోళన చేస్తామని ఆయన గురువారం హెచ్చరించారు. తిరునల్వేలి జిల్లా కూట్లపులి మత్స్యకార గ్రామానికి చెందిన తమ పార్టీ కార్యకర్త తన చేపల వేట బోటుపై 'తమిళగ వెట్రి కళగం' అని పేరు రాయగా,అతడికి ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సీడీని అధికారులు ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. చేపల వేట జీవనాధారమైన జాలర్ల పట్ల ఇలాంటివివక్షచూపడం ఏమాత్రం సమంజం కాదన్నారు. పడవపై టీవీకే రాసివున్న అక్షరాలను చెరిపేస్తేనే ప్రభుత్వం సాయం అందజేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీచేసింది ఎవరు? అదేసమయంలో డీఎంకే పేరు లేదా జెండాలు ఉన్న జాలర్లకు ఇదే తరహా ఆదేశాలు జారీ చేయగలరా? అని విజయ్ ప్రశ్నించారు. జాలర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన పూర్తి రాయితీ నగదును ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ రాష్ట్ర స్థాయిలో భారీ ఆందోళన చేస్తుందని విజయ్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో హెచ్చరించారు.

'కారైక్కాల్'లో మాంగని తిరువిళా



అడయార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కారైక్కాల్ భారతియార్ వీధిలో ఉన్న కారైక్కాల్ అమ్మయార్ ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం మాంగని తిరువిళా వేడుకలు జరిగాయి. ఈ నెల 8న ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా, గురువారం ప్రధాన వేడుక అయిన పిచ్చాండవర్ ఊరేగింపు, మాంగని తిరువిళా (మామిడిపండ్ల) జరిగింది. ఉదయం 9 గంటలకు కైలాసనాథర్ ఆలయం ఎదురుగా ఉన్న శివపెరుమాళ్ పిచ్చాండవర్ అవతారంలో మాఢ వీధుల్లో ఊరేగింపుగా వచ్చారు. ఆ సమయంలో కోర్కెలు నెరవేరిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్న భక్తులపై మామిడిపండ్లను విసిరివేయగా, వాటిని భక్తులు పట్టుకునేందుకు పోటీ పడ్డారు.

ఎండీఎంకేలో ముసలం

● ముల్లై సత్య తీరు సరిలేదన్నవైగో

● 'ద్రోహి' అనే పేరుతో వెళ్లగొట్టేందుకు యత్నం: సత్య

చెన్నై, జూలై10(ఆంధ్రజ్యోతి): ముల్లై సత్య తీరు సరిలేదనే వైగోవ్యాఖ్యలతో ఎండీఎంకేలో దుమారం చెలరేగింది. 'ద్రోహి' అని ముద్ర వేసి వెళ్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ముల్లై సత్య ఆరోపించారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైగో, ఉప ప్రధాన కార్యదర్శి ముల్లై సత్య మధ్య బేధాభిప్రాయాలు ఏర్పాడ్డాయి. ఒకానొక సమయంలో ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలుగుతానని దురై వైగై ప్రకటించారు. దీంతో పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతి చెందగా, వైగో, పార్టీ సీనియర్ నేతలు వారితో చర్చించి సమాధానపరిచారు. కానీ, వారి మధ్య బేధాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఇటీవల వైగో మీడియాతో మాట్లాడుతూ... ప్రభాకరన్‌కు ముత్తయ్య ద్రోహం చేసినట్లు, నాకు ముల్లై సత్య ద్రోహం చేస్తున్నారని, ఆయన తీరు సరిగా లేదని వ్యాఖ్యానించారు. దీంతో, ఎండీఎంకే నుంచి ముల్లై సత్య వైదొలుగుతారని వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో, నగరంలో గురువారం మీడియాతో సమావేశమైన వైగో, పార్టీలో ఎలాంటి బేధాభిప్రాయాలు లేవన్నారు. గతంలో పార్టీ నుంచి సెంజి గణేశన్ సహా పలువురు వైదొలిగినా ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నారు. ఎవరూ వైదొలిగినా పార్టీకి నష్టం ఉండదన్నారు. పార్టీ నుంచి వైదొలిగిన వారితో నేతలు, కార్యకర్తలు సఖ్యతగా ఉండడం మంచి పద్ధతి కాదన్నారు. ముల్లై సత్య సహా పలువురు దళిత వర్గాలకు పార్టీలో పదవులు ఇచ్చామని, వారు కూడా పార్టీకి తోడుగా ఉన్నారన్నారు. కానీ, కొంతకాలంగా పలువురు నేతల పనితీరులో మార్పులు వచ్చాయన్నారు. వారిపై వచ్చిన విమర్శలు పార్టీ నిర్వాహక కమిటీలో చర్చించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వైగో తెలిపారు. కాగా, వైగో వ్యాఖ్యలపై ముల్లై సత్య స్పందిస్తూ... వైగో వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయన్నారు. కుటుంబ రాజకీయాలను అధికమించి పార్టీని నడిపిన వైగో, ప్రస్తుతం దురై వైగోకు పార్టీ పదవి కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటివరకు ఆయన ప్రాణాలు మూడు సార్లు కాపాడానని, ప్రస్తుతం ద్రోహి అనే పట్టం కట్టి పార్టీలో నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ముల్లై సత్య ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ



ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం గురుపూర్ణిమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యాసంస్థలు, ఆలయ ప్రాంగణాల్లో గురువులను, ఉపాధ్యాయులను గౌరవించి వారి ఆశీస్సులు పొందారు. బ్రాడ్‌వే ఆచారప్పన్‌వీధిలోవున్న అక్షయ సాయిబాబు ఆలయంలో ఉదయం కాకడ హారతి, 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విఘ్నేశ్వరపూజ, సాయినాథ హోమం, 108 శంఖాలతో విశేష అభిషేకం, దీపారాధనలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యనారాయణస్వామికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, దీపారాధన, ప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు సాయంకాల పూజ, దూపహారతి అనంతరం భజన గీతాలు ఆలపించారు.. రాత్రి 8.30 గంటలకు సాయినాథుని పల్లకీలో ఊరేగించారు. జై వాసవీ సాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు పర్యవేక్షణలో నిర్వహించిన గురుపూర్ణిమ పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిపాయిల తిరుగుబాటు 219వ స్మారక వేడుకలు



సిపాయిల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, ప్రజా ప్రతినిధులు, అధికారులు

వేలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట సమీపంలోని సిపాయిల తిరుగుబాటు 219వ స్మారక దినోత్సవాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో భాగంగా పలు శాఖల అధికారులు స్మారక స్థూపంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘననివాళులర్పించారు. 1806 జూలై 10వ తేది వేలూరు కోటలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఆంగ్లేయుల నిబంధనలు వ్యతిరేకించిన సిపాయిలు 1806 జూలై 10వ తేది తెల్లవారుజామున 4 గంటకుల కోటపై దాడిచేసి పలువురు ఆంగ్లేయుల అధికారులు, సైనికులను హతమార్చారు. ఆంగ్లేయుల పతాకం దించి పులి చిహ్నంతో కూడిన జెండా ఎగురవేశారు. ఈ ఘటనలో ఆంగ్లేయులు భారీగా సైనికుల రప్పించి జరిపిన ప్రతిదాడుల్లో 800 మంది సిపాయిలు ప్రాణాలు కోల్పోయారు. సిపాయిల స్మారకార్థం ప్రతి ఏడాది జూలై 10న సిపాయిల తిరుగుబాటు దినంగా జరుపుకుంటుంటారు. ఈ ప్రకారం, గురువారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కార్తికేయన్, ఎస్పీ మదివానన్, మేయర్ సుజాత, కాంగ్రెస్ నేత అసేన్ సహా పలు రాజకీయ పారీల నేతలు, మాజీ సైనికులు సిపాయి స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: కడప్పేరి మెప్స్ ఏరియా, మౌలానా నగర్, సింగారవేలన్ వీధి, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, రంగనాథపురం, ఖాదర్ భాయ్ వీధి, కన్నన్ వీధి, జీఎస్‌టీ రోడ్డు కొంత భాగం, రమేష్ నగర్, ఆర్పీ గార్డన్, దురైస్వామి పిళ్లై వీధి, ఎమ్మార్ థియేటర్, ముడిచూర్ సర్వీస్ రోడ్డు, మార్కెట్ ఏరియా, కార్పొరేషన్ ఆఫీసు, జడ్జి కాలని, కామకోటి నగర్, శ్రీరామ్ నగర్, ఎంఎంఆర్ వీధి, గాంధీ రోడ్డు, వళ్లువర్ గురుకులం.

అంబత్తూర్: గాలెక్సీ రోడ్డు, పెరియార్ వీధి, శివపాదం వీధి.

కోయంబేడు మార్కెట్: మాతా ఆలయ వీధి, అలగమ్మాళ్ నగర్ 1 నుంచి 8 వీధులు, తిరువళ్లువర్ వీధి, నేతాజి అవెన్యూ, కన్నియమ్మన్ నగర్, నారాయణిఅమ్మన్ ఆలయవీధి, భారతియార్ వీధి.

చెట్‌పెట్: పీసీ హాస్టల్ రోడ్డు, నౌరోజి రోడ్డు, ఎంసీ నికోలస్ రోడ్డు, హారింగ్టన్ రోడ్డు, ఓల్డ్ షెనాయ్ నగర్, గురుస్వామి రోడ్డు, చెట్‌పెట్ జగన్నాధపురం, మంగళాపురం, స్కూల్ రోడ్డు, బృందావన్ వీధి, వళ్లువర్‌కోట్టం హైరోడ్డు, నుంగంబాక్కం హైరోడ్డు, స్టెర్లింగ్ రోడ్డు, కోఠారి రోడ్డు, జయలక్ష్మిపురం 1వ వీధి, సీతా నగర్ 2వ వీధి, వీట్ క్రాఫ్ట్ రోడ్డు, శివగంగ రోడ్డు, కొత్త వీధి, అవెన్యూ వీధి, పొన్నాంగిపురం, కుట్టి వీధి, మేయర్ శివషణ్ముగం వీధి, అప్పు వీధి.

నొలంబూర్: ఎంసీకే లేఔట్, పనస్‌చూలై వీధి, ఎంజీఆర్ కాలేజ్, 200 అడుగుల సర్వీస్ రోడ్డు.

కొట్టివాక్కం: పాలకాలై నగర్, జగన్నాధన్ వీధి, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, కొట్టివాక్కంకుప్పం, కుప్పం రోడ్డు, ఏజీఎస్ కాలని 1 నుంచి 3 వీధులు, లక్ష్మీవందన వీధి, సీతామరైకన్నన్ రోడ్డు, న్యూ కాలనీ 1 నుంచి 4 వీధులు, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి, తులుకాత్తమ్మన్ ఆలయ వీధి.

అయ్యప్పన్‌తాంగళ్: కాట్టుపాక్కం, చెందూరుపురం, శ్రీ నగర్, విజయలక్ష్మి నగర్, జానకిఅమ్మాళ్ నగర్, స్వర్ణపురి నగర్, ఆడిసన్ నగర్, శ్రీనివాసపురం, కృష్ణ నగర్, మారుతి నగర్, నూంబల్, మౌంట్ పూందమల్లి రోడ్డు, ఆయిల్ మిల్ రోడ్డు, ఆడ్కో నగర్, సుబ్బయ్య నగర్, కృష్ణవేణి అమ్మాళ్ నగర్, వసంతం నగర్, శివరామన్ కృష్ణా నగర్, విజయలక్ష్మి అవెన్యూ.

రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో ఉన్న రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు కలకలం రేపింది. గవర్నర్ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్‌లో భవనం ప్రాంగణంలో బాంబు ఉంచినట్లు మెసేజ్ ఉంది. దీంతో, రాజ్ భవన్ ఉద్యోగులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, భవనం, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. అదే సమయంలో, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

● కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ ..

క్షమాపణ కోరిన జీసీసీ కమిషనర్

● రూ. లక్ష జరిమానా రద్దు

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ కేసులో, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ నేరుగా హాజరై క్షమాపణ కోరడంతో, రూ. లక్ష జరిమానా ఉత్తర్వులను హైకోర్టు వాపసు తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు సంబంధించి ఇచ్చిన ఉత్తర్వులు అమలుచేయకపోవడంతో, కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులో చెన్నై కార్పొరేషన్ కమిషనర్‌కు మద్రాసు హైకోర్టు రూ. లక్ష జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ గురువారం కోరుకు హాజరై క్షమాపణ కోరారు. కోర్టు ఉత్తర్వులు కావాలని ఉల్లంఘించలేదని, జరిగిన తప్పుకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు కమిషనర్ తెలుపడంతో, జరిమానా విధించిన ఉత్తర్వులువాపసు తీసుకుంటున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

ఆత్మహత్యకు దారితీసిన కుటుంబ కలహాలు

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక మనలి పుదునగర్‌లో చోటుచేసుకుంది. మనలి పుదునగర్‌కు చెందిన వేదగిరి (45)హేమమాలిని (44) దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె వివాహమై భర్తతో మరో గ్రామంలో నివసిస్తుండగా, కుమారుడు చదువుతున్నాడు. వేదగిరి-హేమమాలిని మధ్య తరచూ గొడవలు జరిగేవని సమాచారం. ఘటన జరిగిన రోడ్డు వారిద్దరి మధ్య వాగ్వివాదం తారస్థాయికి చేరకుంది. దీంతో, వేదగిరి తాను వాడే మాత్రలు అధికంగా వేసుకుని స్పృహతప్పి పడిపోయాడు. ఈ విషయాన్ని కుమారుడు తల్లితో చెప్పగా, ఆమె మరో గదిలోకి వెళ్లి అవే మాత్రలు తీసుకుంది. చుట్టుపక్కల వారు ఇద్దర్నీ స్టాన్లీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక ఐదు రోజుల క్రితం హేమమాలిని మృతిచెందగా, వేదగిరి బుధవారం మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'నీట్' శిక్షణ పొందుతున్న విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'నీట్' కు శిక్షణ పొందుతున్న ప్లస్ వన్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుచ్చిలో చోటుచేసుకుంది. తిరుచ్చి సోమరసం పేట ప్రాంతానికి చెందిన పెరియస్వామి టీ దుకాణం నడుపుతున్నాడు. ఆయనకు సత్య అనే భార్య, దర్శిని (16) అనే కుమార్తె ఉన్నారు. దర్శిని ప్రైవేటు పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. అలాగే, ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో లాంగ్ టర్మ్ నీట్ శిక్షణ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో, ఇటీవల నిర్వహించిన నీట్ మొదటి సెమిస్టర్‌లో దర్శిని తక్కువ మార్కులు వచ్చినట్లు తెలిసింది. ఈ కారణంగా మనస్థాపం చెందిన ఆమె, బుధవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వచ్చి మేడపై గదిలోకి వెళ్లింది. ఎంతకూ ఆమె రాకపోడంతో తల్లి మిద్దెపైకి వెళ్లి చూడగా, ఫ్యానుకు ఉరేసుకుని కుమార్తె ఆత్మహత్యకు పాల్పడడం గుర్తించి బోరున విలపించింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ విక్రయాలు.. దుకాణాలకు జరిమానా

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో రాష్ట్రంలో నిషేధించిన ప్లాస్టిక్ బ్యాగులను విక్రయించిన 16 దుకాణాల యజమానులకు అధికారులు రూ.29వేలు జరిమానా విధించారు. ఈ మార్కెట్ ప్రాంగణంలోని కొన్ని దుకాణాల్లో ప్లాస్టిక్ బ్యాగులను విక్రయిస్తున్నట్లు కోయంబేడు మార్కెట్ నిర్వాహక అధికారులకు తెలిసిన సమాచారంతో గురువారం వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, 16 దుకాణాలపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం



పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అరుప్పుకోట సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. విరుదునగర్ జిల్లా అరుప్పుకోట మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిపై గురువారం ఉదయం కంటైనర్, సరుకుల లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో సరుకుల లారీ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు సహా ముగ్గురు మృతిచెందారు. లారీ శిధిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసేందుకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ ఘటనపై అరుప్పుకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చెట్టుకు నిప్పు పెట్టిన అగంతకులు



మళ్లీ చిగిరిస్తున్న చెట్టు . (పక్క చిత్రంలో) అగ్నికి ఆహుతి అవుతున్న దృశ్యం

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం కీల్‌కదిర్‌పూర్ ప్రాంతంలో నాటిన చింత చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం కలకలం రేపింది. కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న పల్లవన్ నగర్ ప్రాంతంలోని వందేళ్ల నాటి చింత చెట్టును తొలగించాలని ఇంటి యజమాని నిర్ణయించాడు. ఈ విషయాన్ని పచ్చదనం ప్రేమికుల సంఘంతో చర్చించి, 2024 మే 13న, రూ2 లక్షలు ఖర్చు చేసి ఎక్స్‌కవేటర్ల సాయంతో చెట్టును పెకలించి కీలకదిర్‌పూర్‌లో నాటారు. ఈ చెట్టు మళ్లీ చిగురించేలా పర్యావరణ, పచ్చదనం ప్రేమికులు ఏడాది నుంచి పర్యవేక్షిస్తుండగా, ప్రస్తుతం ఆ చెట్టుకు కొత్త కొమ్మలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి ఈ చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు గమనించిన చుట్టుపక్కల వారు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునేలోపు చెట్టంతా పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై పర్యావరణ ప్రేమితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు బెయిలు కోరుతూ మదురై ఆధీనం పిటిషన్

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిలు కోరుతూ మదురై ఆధీనం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఉళుందూర్‌పేట సమీపంలో పథకం ప్రకారం హత్య చేసేందుకు రూపొందించారని మదురై ఆధీనం ఆరోపించారు. ఈ ప్రమాదంపై మదురై ఆధీనం మాట్లాడుతూ... నెంబరు ప్లేట్ లేని వాహనం ద్వారా పథకం రూపొందించారని, ఒక మతం వారు ఈ ఘాతుకానికి ఒడిగట్టారని ఆరోపించారు. కాగా, మదురై ఆధీనం భేటీ తర్వాత విడుదల చేసిన సీసీ ఫుటేజీలో, మదురై ఆధీనం వెళుతున్న కారు మరో కారును ఢీకొని ప్రమాదానికి గురైన దృశ్యాలున్నాయి. ఈ నేపథ్యంలో మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మదురై ఆధీనం వ్యవహరిస్తున్నారంటూ న్యాయవాది రాజేంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై చెన్నై ఈస్ట్ మండల సైబర్ క్రైం పోలీసులు, మదురై ఆధీనంపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. అలాగే, మదురై ఆధీనం స్వయంగా విచారణకు హాజరుకావాలని పోలీసులు సమన్లు పంపినా, ఆయన హాజరుకాలేదు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని మదురై ఆధీనం తెలుపగా పోలీసులు నిరాకరించారు. అనంతరం ఈనెల 5వ తేది విచారణకు హాజరుకావాలని రెండవ సారి సమన్లు పంపారు. అయినా, ఆయనకు బదులు మఠం కార్యదర్శి సెల్వకుమార్ విచారణకు హాజరయ్యారు. వృద్ధాప్యం కారణంగా మదురై ఆధీనం నేరుగా పోలీస్ స్టేషన్‌కు హాజరుకాలేకపోతున్నారని, మరికొంత సమయం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, సైబర్ క్రైం పోలీసులు 2వ సారి సమన్లు పంపిన నేపథ్యంలో, ముందస్తు బెయిలు కోరుతూ మదురై ఆధీనం తరఫున చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

సైకో థ్రిల్లర్‌గా 'యాదుం అరివాన్'


దినేష్, ప్రాణ

బ్రేకింగ్ పాయింట్ పిక్చర్స్ పతాకంపై ఎం.గోపి దర్శకత్వంలో 'యాదుం అరియాన్' చిత్రం సైకో థ్రిల్లర్‌గా రూపొందించారు. ఇందులో హీరోగా దినేష్‌గా, హీరోయిన్‌గా ప్రాణ నటించారు. వీరితో పాటు కేపీవై బాలా, ఆనంద్ పాండి, శ్యామల్, అప్పుకుట్టి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ సినిమా స్టోరీ కేవలం ఐదు పాత్రలతోనే సాగుతుంది. ఇప్పటివరకు వచ్చిన సైకో చిత్రాలకంటే కాస్త భిన్నంగానే తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ నెల 18న విడుదలకానున్న ఈ చిత్రం విశేషాలను హీరో దినేష్ వివరిస్తూ, 'నేను పెద్ద ఫ్యామిలీ నుంచి వచ్చినప్పటికీ.. సినిమాలో దర్శకుడు చెప్పినట్టుగా నడుచుకున్నాను. ఈ సినిమా కోసం నా పనులన్నీ పక్కనబెట్టాను. ఈ పాత్రకు నన్ను ఎంపికచేసిన తర్వాత శక్తిమేరకు శ్రమించాను. ఈ ట్రైలర్‌లోని పలు సన్నివేశాలు వివాదాస్పదమయ్యాయి. ఇందులో అక్కడక్కడా రాజకీయ డైలాగులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నాకు ఇష్టంలేకపోయినా దర్శకుడు దృక్కోణానికి వదిలివేశాను. ఈ ట్రైలర్ చూసిన హీరోలు విజయ్, శివకార్తికేయన్ బాగుందని ప్రశంసించారన్నారు. దర్శకుడు గోపి మాట్లాడుతూ, 2024 నుంచి 2026 వరకు సాగే చిత్రం. ఇది టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ కాదు. కానీ, కథ చేసేందుకు అలా ఉంటుంది. అది ఎలా సాధ్యమన్నదే ఆసక్తిగా ఉంటుంది. ఇతర సైకో థ్రిల్లర్ చిత్రాలకు మా చిత్రానికి మధ్య వ్యత్యాసం ఉంది. టైమ్ ట్రావెల్ లాంటి స్టోరీని ఎలా డీల్ చేశామన్నది ఆసక్తి కలిగించే అంశం' అని అన్నారు.



సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

రిస్ట్ వాచ్ బహుమతిగా ఇచ్చిన శరత్‌కుమార్

● '3బీహెచ్‌కే' సక్సెస్ మీట్

'3బీహెచ్‌కే' సంగీత దర్శకుడు అమృత్ రామ్‌నాథ్‌కు ప్రముఖ నటుడు శరత్ కుమార్ తన చేతి గడియారాన్ని బహుమతిగా ఇచ్చారు. సిద్ధార్థ్, శరత్ కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం '3బీహెచ్‌కే'. ఈ నెల 4వ తేదీ విడుదలై ఘన విజయం సాధించింది. దీంతో చిత్ర బృందం విజయోత్సవ వేడుకలను నగరంలో తాజాగా నిర్వహించగా, దర్శకనిర్మాతలతో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఇందులో శరత్ కుమార్ మాట్లాడుతూ, 'ఫైట్స్, పాటలు వంటి కమర్షియల్ ఎలిమెంట్స్ లేకుండా దర్శకుడు శ్రీగణేష్ తాను అనుకున్నది వెండితెరపై ఆవిష్కరించారు. దర్శకుడు స్క్రిప్టుకి అమృత్ తన సంగీతంతో ప్రాణం పోశాడు. పైగా నా వాచ్ చాలా బాగుందని అమృత్ అన్నాడు. అందుకే ఈ వాచ్‌ను అతనికి బహుమతిగా ఇస్తున్నాను' అని అన్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కాన్సెప్ట్ హీరో. అలాంటి కథతో చిత్రాన్ని నిర్మించిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ఇది నా 40వ చిత్రం. సక్సెస్ సాధించింది. ఈ స్క్రిప్టు చదివిన తర్వాత నా తండ్రిని హగ్ చేసుకుని ముద్దు పెట్టుకోవాలని అనిపించింది. దాన్నే ఈ సక్సెస్ వేడుకల పోస్టరుగా ముద్రించాం. శతర్ కుమార్ - దేవయాని మధ్య తరగతి జంటగా తెరపై జీవించారు. చైత్ర, మీత తమ పాత్రలకు న్యాయం చేశారు' అన్నారు. దర్శకుడు శ్రీగణేష్ మాట్లాడుతూ, 'నేను దర్శకత్వం వహించిన రెండో చిత్రాన్ని సరిగా తీయలేకపోయాను. కానీ, మూడో చిత్రంతో సక్సెస్ సాధించాను. చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించిన మీడియాకు ధన్యవాదాలు. ఈ సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు హీరో కార్తికి, ప్రాజెక్టు ప్రారంభం నుంచి ముగిసే వరకు వాకబు చేస్తూ ప్రత్యేక దృష్టిసారించిన హీరో శివకార్తికేయన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు' తెలిపారు. ఆ తర్వాత నటి దేవయాని, హీరోయిన్లు మీతా రఘునాథ్, చైత్ర, సంగీత దర్శకుడు అమృత్ రామ్‌నాథ్ తదితరులు ప్రసంగించారు.

ధనుష్ హీరోగా 'డి-54' ప్రారంభం

ప్రముఖ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ నిర్మాణ సంస్థ వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ధనుష్ హీరోగా కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'డి-54' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే. ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం గురువారం జరిగింది. 'పోర్ తొళిల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని రూపొందించిన విఘ్నేష్ రాజా దర్శకుడు. ఆసక్తికర కథాంశంతో ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా నిర్మించనున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమితా బైజు హీరోయిన్. కేఎస్ రవికుమార్, జయరామ్, కరుణాస్, సూరజ్ వెంజరమూడు, పృథ్వీ పాండియరాజన్ తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాష్ కుమార్ సంగీత స్వరాలు సమకూరుస్తున్నారు. దేశంలోని వివిధ ప్రదేశాలలో చిత్రీకరణ చేయనున్నారు.


ఐసరి గణేష్, ధనుష్, విఘ్నేష్ రాజా

చిత్రజ్యోతి





సెప్టెంబరులో 'బ్యాడ్ గర్ల్' రిలీజ్


'బ్యాడ్ గర్ల్'లో అంజలి శివరామన్

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్, బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ నిర్మాతలుగా నిర్మించిన చిత్రం 'బ్యాడ్ గర్ల్'. చిత్ర నిర్మాణం పూర్తి చేసుకుని ఎప్పుడో విడుదలకావాల్సిన ఈ చిత్ర వాయిదా పడింది. టీజర్‌ను చూసిన పలు మహిళా సంఘాల ప్రతినిధులు సినిమాపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అదేసమయంలో సెన్సార్‌లోనూ సమస్యలు తలెత్తినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 5వ తేదీ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. ఈ మేరకు వెట్రిమారన్ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ తన ట్విటర్ హ్యాండిల్‌లో అధికారికంగా వెల్లడించింది. త్వరలోనే ప్రమోషన్ కార్యక్రమాలు వెల్లడించనున్నట్టు తెలిపింది. ఇప్పటికే వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడి, అనేక అవార్డులను గెలుచుకున్న ఈ చిత్రం.. రోటర్ డ్యామ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మకమైన 'ఎన్ఈటీపీఏసీ' అవార్డును సొంతం చేసుకుంది. ఈ సినిమాకు వెట్రిమారన్ వద్ద సహాయ దర్శకురాలిగా పనిచేసిన వర్ష భరత్ దర్శకత్వం వహించారు. ఇందులో అంజలి శివరామన్, శాంతి ప్రియ, హృదు హరూన్, టీజే అరుణాచలం, శశాంక్ బొమ్మిరెడ్డిపల్లి, శరణ్య రవిచంద్రన్ తదితరులు నటించారు.

బోళాశంకరుడి ప్రసన్నం కోసం భక్తులు ఆరాటపడుతుంటారు. కాశీ నుండి రామేశ్వరం వరకు వివిధ క్షేత్రాల్లో వివిధ రూపాల్లో, బహునామాలతో ఈశ్వరుడు భక్తులను అనుగ్రహిస్తుంటారు. అయితే శ్రీమల్లికార్జున స్వామిగా కొలువైన పర్వతమలై శివాలయానికి వెళ్లాలంటే ఎంతో ధైర్యసాహసాలుండాలి. సముద్రమట్టానికి సుమారు 5 వేల అడుగుల ఎత్తులో ఇరుకైనమెట్లు, బండరాళ్ల నడకదారి, నిట్టనిలువునిచ్చెన మార్గం ఇలా ఎన్నో రకాలైన దారుల్లో నడవాల్సి ఉంటుంది. పర్వతాలయం చేరాలంటే ఏడుకిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. దట్టమైన చెట్ల నడుమ సాగే ఈ పర్వాతారోహణ సాహసికులు, ముఖ్యంగా ట్రెక్కింగ్ చేసేవారు ఎక్కువ ఇష్టపడతారు భక్తులకు శివయ్య పెట్టే ఈ పరీక్షలను అధిగమిస్తే భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి దర్శనం, అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తాయి.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి






తెన్‌మాదిమంగళం దారిలో మెట్ల మార్గం - పర్వతశిఖరాగ్రంపై మెట్లదారి - పర్వతారోహణ మార్గంలో కోట - మౌనస్వామి విఠోబానంద మఠం - ఇనుపనిచ్చెనపైనుంచి వెళ్తున్న భక్తులు

పర్వతారోహకులకు ప్రత్యేకం..

ముక్తినిచ్చే శైవ క్షేత్రం


పర్వతాలయ విహంగవీక్షణం

ఆధ్యాత్మికం

● పరమేశ్వరుడు కొలువైన పర్వతమలై ● ఐదువేల అడుగుల ఎత్తులో అరుదైన శైవక్షేత్రం ● వనమూలికల పర్వతాలయం

సిద్ధపురుషుల నివాసక్షేత్రం...

తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం తాలూకా కడలాడి, తెన్‌మాదిమంగళం గ్రామాలకు చేరువగా 5500 ఎకరాల విస్తీర్ణం కలిగి 4560 అడుగులు ఎత్తున్న పర్వతం పర్వతమలై . ఈ పర్వతశిఖరాగ్రంపైనే మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఈ పర్వతాన్ని అధిరోహించేందుకు 700 అడుగుల ఎత్తుకలిగిన నిట్టనిలువు గడ్డపారై పడి, తండవాళపడి, ఏని పడిగళ్ ఉన్నాయి. పౌర్ణమి, సాధారణ రోజుల్లో భక్తులు కొండపైకి వెళ్ళి అక్కడే బసచేసి స్వామివారి దర్శనం చేసుకుంటారు. అమావాస్య రోజున పర్వతం దిగువ నుండి శిఖరాగ్రం వరకు రాత్రిపూట స్వామివారు భక్తులకు మార్గాన్ని చూపుతూ నీలిరంగు వెలుగును ప్రసరింపజేస్తుంటారు. సిద్ధపురుషులు స్థిరనివాసమేర్పరచుకున్న ఈ పర్వతంలో ఎంతో మంది భక్తులకు ఆ మహాపురుషులు దర్శనమిచ్చారు. ఉత్తరాది రాష్ట్రాల్లో చేసినట్టుగానే ఈ క్షేత్రంలోనూ భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహిస్తున్నారు.


పున్నమివెలుగులో గర్భాలయ విమానం

7 రకాల కాలినడక మార్గాలు...

ఈ పర్వతాన్ని అధిరోహించడానికి ఏడు రకాల కాలినడక మార్గాలున్నాయి. 3 వేల అడుగుల వరకు నిట్టనిలువుగా మెట్లు గడ్డపారైపడి (గడ్డపార లేదా గునపంలా నిట్టనిలువుగా ఉండటం) మార్గం, దండవాళపడి (రైలు పట్టాల్లాంటి మార్గం) ఏనిప్పడి (నిచ్చెనలాంటి మార్గం), చివరగా ఆకాయపడి (శిఖరాగ్రంలోని కాలినడక మార్గం) ఉన్నాయి. ఈ పర్వతం ఎల్లప్పుడు మూలికల వాసన వెదజల్లుతుంటుంది. అవి దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తాయని ఈ క్షేత్రాన్ని సందర్శించిన భక్తులు చెబుతారు. ఈ పర్వతంలో వందకుపైగా గుహల్లో సిద్ధపురుషులు సూక్ష్మరూపంలో నివసిస్తున్నట్లు చెబుతారు. ఆలయంలోని భ్రమరాంబిక అమ్మవారి చెంపవద్ద ఓ జ్యోతి దర్శనమిస్తుంది. పర్వతశిఖరాగ్రంపై రాక్షస త్రిశూలం ఉంది. ఆ త్రిశూలాన్ని తలపైకెత్తి చూస్తుంటే మేఘాలు భక్తులను స్పృశిస్తాయి. పౌర్ణమి పూజలు ఇక్కడ వైభవంగా జరుగుతాయి. ఈ క్షేత్రానికి దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. సకల రోగాలను నయంచేసే పాతాళ బుగ్గ తీర్థం కూడా ఉంది. 26 కి.మీ. వ్యాసంతో ఉన్న ఈ పర్వతాన్ని పౌర్ణమి రోజున ఓ సారి ప్రదక్షిణ చేస్తే కైలాసాన్ని ప్రదక్షిణ చేసినంత పుణ్యం లభిస్తాయన్నది ఐతిహ్యం. కన్నియాకుమారిలాగే ఈ పర్వతంపై నుండి సూర్యోదయం, సూర్యాస్తమయాన్ని వీక్షించడం వింత అనుభూతిని కలిగిస్తుంది. ఈ పర్వతంపై మల్లికార్జునస్వామిని దర్శించేందుకు వెళ్లే భక్తులు తప్పకుండా భోజనం, తాగునీరు, దుప్పటి, టార్చ్‌లైట్, దీపం పూజా సామగ్రిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. జీవితంలో ఒక్కసారైనా ఈ పర్వతాన్ని అధిరోహించి మల్లిఖార్జున స్వామివారిని దర్శించుకుంటే సకలసౌభాగ్యాలు, ముక్తి ప్రాప్తిస్తాయి. పర్వతంపైని సాధువుల దర్శనం పాపవిమోచనం కలిగిస్తుంది.


భ్రమరాంబిక

సంజీవని పర్వతమా?

పర్వతమలైని సంజీవని పర్వతంలోని కొంత భాగమేనని శైవాగం పండితులు చెబుతున్నారు. లక్ష్మణుడిని కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని మోసుకెళుతుండగా ఆ పర్వతంలోని చిన్న భాగం ఇక్కడ పడిందని పురాణాలు చెబుతున్నాయి. ఆ కారణంగానే ఈ పర్వతం అంతటా మూలికల వాసన వస్తుంటుందని చెబుతున్నారు. సంజీవని పర్వతంలో ఓ భాగం కనుకనే ఈ పర్వతంపె ఆలయ ప్రవేశద్వారం వద్ద హనుమంతుడి విగ్రహం ఉంది. ఆలయ గర్భాలయానికి తలుపులు లేవు. భక్తులు ఏ సమయంలోనైనా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరుపుకోవచ్చు. ఎర్వతమలై శిఖరంపై మల్లిఖార్జునస్వామి ఆలయం, మరో చిన్న కొండపై మౌనస్వామి విట్టోబనాథుడి ఆశ్రమం ఉన్నాయి. పౌర్ణమి తదితర పర్వదినాల్లో ఆ ఆశ్రమం వద్ద ట్రిప్లికేన్ ప్రాంతానికి చెందిన భక్తులు అన్నదానం చేస్తుంటారు. ఈ ఆలయంలో మూలవిరాట్టు మల్లిఖార్జునస్వామి, అమ్మవారు భ్రమరాంబిక కొలువుదీరి ఉన్నారు. గణపతి, వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారు, భైరవుడు, అగస్త్యమహర్షి కూడా వేర్వేరు సన్నిధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.


మల్లికార్జునస్వామి, నందీశ్వరుడు

చోళుడి వీరగాథ... : ఈ పర్వతమలై దిగువ భాగంలోనే కరికాల్ర చోళుడి వీరగాథ ప్రారంభమవుతుంది. కరికాల్ర చోళచక్రవర్తి వెయ్యి ఏనుగులను కనుసైగతోనే ఆజ్ఞ శిరసావహించేలా పెంచిపోషించాడు. ఆ ఏనుగులకు ఆయన శిక్షణ ఇచ్చిన ఈ పర్వత శ్రేణుల్లోనే! ఓ అమావాస్య రాత్రి కడలిలో ఈ ఏనుగులను నౌకలా తేలియాడేలా నడిపి సముద్రపు దొంగలను మట్టుబెట్టాడని చరిత్రలో వుంది. ఈ పర్వతంపై ఆలయానికి వెళ్లే మార్గంలో ఓ చిన్న కోట కూడా ఉంది. ఆ కోట ద్వారం వద్ద పాడుబడిన రాతి మంటపం ఉంది. ఈ మండపాన్ని అర్ధమండపం అని పిలుస్తున్నారు. నన్నన్ అనే చక్రవర్తి ఈ కోట నిర్మించినట్టు చెబుతారు. వాననీటిని సేకరించేందుకు చిన్న కొలనుకూడా అక్కడే ఉంది. పర్వతమలైని అధిరోహించి ఆలయలో దీపం వెలిగించి అభిషేకం చేస్తే సంవత్సరం పొడవునా పూజలు చేసినంతటి ఫలం దక్కుతుంది.

ఎలా వెళ్ళాలి?... : కోయంబేడు బస్‌స్టేషన్ నుండి పర్వతమలైకి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు నడుపుతున్నారు. తిరువణ్ణామలై నుండి కూడా ఈ క్షేత్రానికి బస్సులున్నాయి. పర్వతంపై నీటి సదుపాయం లేదుకనుక భక్తులు తమ వెంట మూడు లీటర్ల మంచినీరు, ఆహారపదార్థాలు, చాక్లెట్, గ్లూకోజ్ ప్యాకెట్లు, బిస్కెట్లు తీసుకెళ్ళాలి. పర్వతారోహణ చేసే ఇతర భక్తులకు తమవంతు సాయం అందించాలి. ఎండవేడి లేని సమయాల్లో ఉదయం 10 గంటలలోగా, సాయంత్రం నాలుగు గంటల తర్వాత పర్వతారోహణ చేయడం మంచిది. కొండైకి వెళ్లేందుకు బాణపు గుర్తులు కూడా ఉన్నాయి. వాటిని అనుసరిస్తూ పర్వతంపైకి వెళ్ళాలి. కొండపై రాత్రిపూట చేరుకునే భక్తులు తప్పకుండా తమ వెంట టార్చిలైటు తీసుకెళ్ళాలి. కొండపై చలి విపరీతంగా ఉంటుంది. కొండపై ఎలాంటి మరుగుదొడ్లు లేవు కనుక భక్తులు కాలకృత్యాలను ముందుగానే ముగించుకుని వెళ్ళాలి. పర్వతం అంతటా సిద్ధపురుషులు సూక్ష్మరూపంలో ధ్యానం చేస్తుంటారు కనుక కొండపైకి నడిచి వెళ్లే భక్తులు బిగ్గరగా మాట్లాడకూడదు. కేకలు వేయకూడదు. 'ఓం నమశ్శివాయ' మంత్రాన్ని మెల్లగా పఠిస్తూ వెళ్లటం మంచిది.

తెలుగు మీడియం విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

● అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు అజంతా శంకరరావు

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు మీడియం విద్యార్థుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నట్లు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు అజంతా సంస్థ అధినేత డా.కనిగెలుపుల శంకరరావు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి తరుపున తెలుగు మీడియం విద్యార్థిని, విద్యార్థులకు మాతృభాషలో నైపుణ్యం, తెలుగులోని మాధుర్యాన్ని తర్వాతి తరానికి కూడా అందించాలనే సంకల్పంతో గురువారం 23వ వార్షిక పోటీలు నిర్వహించారు. టి.నగర్‌లోని ఆంధ్ర బాలానంద సంఘ ప్రాంగణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 8 పాఠశాలలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వేమన శతకం, సుమతి, కుమార శతకం పద్యాలు, చిత్రలేఖనం, వ్యాసరచన, పద్యపఠనం, రామాయణంపై పద్యపఠనం తదితర పోటీలు జరిగాయి. పోటీల్లో 1 నుంచి 12వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే 6 నుంచి ప్లస్‌టూ తరగతుల విద్యార్థులకు కందుకూరి విరేశలింగం, గురజాడ అప్పారావు, సీపీ బ్రౌన్, గిడుగు రామమూర్తి జీవిత చరిత్రకు సంబంధించి ప్రశ్నలు వేసి, సరైన సమాధానాలు చెప్పిన వారిని విజేతలుగా ఎంపిక చేశారు. సమితి నిర్వాహకులు వసుమతి జయశ్రీ, దామెర్ల పద్మావతి, శివసుబ్రమణ్యం, కల్పనా గుప్తా, బాలాజీ, లావణ్య, కమల తదితరులు ఏర్పాట్లు పరివేక్షించగా, న్యాయనిర్ణేతలుగా ఆముక్త మాల్యద, శారద, లలితా ప్రసాద్, వసంతలక్ష్మి, కె.రమాదేవి, వసుంధర, గజగౌరీ వ్యవహరించారు. ఈ పోటీల ప్రారంభం సందర్భంగా అజంతా శంకరరావు మాట్లాడుతూ, తమిళ రాష్ట్రంలో తెలుగు మీడియం చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తూవస్తోందని, విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేలా సమితి తరుపున 23వ సంవత్సరంగా పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగు కుటుంబాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను మాతృభాషలో చదివించి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.


విద్యార్థులతో అజంతా శంకరరావు, పద్మావతి, జయశ్రీ తదితరులు

రామేశ్వరం ఆలయంలో జపాన్ భక్తులు



పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథస్వామిని జపాన్ దేశానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. జపాన్ రాజధాని టోక్యోలో ఉన్న శివ ఆధీన మఠం గురువు బాలకుంభముని నేతృత్వంలో 20 మంది భక్తులు రాష్ట్రానికి వచ్చారు. వీరు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు సందర్శిస్తున్నారు. బుధవారం రామేశ్వరానికి వచ్చిన జపాన్ భక్త బృందం, అగ్ని తీర్థ కొలనులో, ఆలయ ప్రాంగణంలోని 22 తీర్థస్థలాల్లో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం ప్రపంచ శాంతి కోరుతూ రుద్ర పూజ, యాగ పూజలు నిర్వహించి స్వామి దర్శనం చేసుకున్నారు.

వీఐటీ చెన్నైలో 'ఫ్రెంచ్ భాషా క్లబ్' ప్రారంభం

చెన్నై, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వీఐటీ చెన్నై ప్రాంగణంలో జరిగిన ఎంబీఏ ఫ్రెషర్స్ ఇండక్షన్ ప్రోగ్రామ్ సందర్భంగా గురువారం ఫ్రెంచ్ లాంగ్వేజ్ క్లబ్ ప్రారంభమైంది. పుదుచ్చేరి, చెన్నైలో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ అయిన ఎటియన్ రోలాండ్ పీగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రపంచ పోటీ తత్వం ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను వివరిస్తూ.. వీఐటీ చెన్నైలో ఫ్రెంచ్ భాషా క్లబ్ ఏర్పాటుతో విద్యార్థులు తమ భాషా సంస్కృతిని కాపాడుకుంటూ ఫ్రెంచ్ సంస్కృతిని ఆస్వాదిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జీ.విశ్వనాథన్ అధ్యక్షపన్యాసం చేస్తూ.. ఎంబీఏ విద్యార్థులకు విస్తృత జ్ఞానం, ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన కలిగి వుండాలని, చుట్టూ వున్న ప్రపంచం గురించి అర్థం చేసుకోవడానికి, తమకు ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు. వీఐటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం సమయపాలన, సానుకూల దృక్పథం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ చెన్నై ప్రొ-వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్, అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహరన్, పుదుచ్చేరి, చెన్నైలోని ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ అధికారులు పాల్గొన్నారు.


ఫ్రెంచ్ భాషా క్లబ్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

రూ.1.20 కోట్లతో చేపల పెంపకం

● **మంత్రి అనితా రాధాకృష్ణన్**

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం ఆనకట్టలు, చెరువుల్లో చేపపిల్లల పెంపకానికి రూ.1.20 కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్రప్రభుత్వ పశుసంవర్ధకశాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం ఆనకట్ట ప్రాంతంలో గురువారం జాతీయ చేపల పెంపకం దినోత్సవం సందర్భంగా సుమారు లక్ష చేపలను మంత్రి నీటిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మత్స్య సంపదను సంరక్షించి వాటి సంతానాన్ని అభివృద్ధి పరచేలా నీటి వనరుల్లో 2025-26వ సంవత్సరంలో మొత్తం 40 లక్షల చేపపిల్లలను పెంచేందుకు రూ.1.20 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం వల్ల నదులు, చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇళం భగవత్, పలు శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



శ్రీవైకుంఠం ఆనకట్టలో చేపపిల్లలను వదులుతున్న మంత్రి అనితా రాధాకృష్ణన్


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలా తోరణం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,501

తలనీలాలు సమర్పించినవారు: 29,033



పులికాట్‌లో అప్పుడే పక్షుల కిలకిలలు









కాలం కాని కాలంలోనూ పులికాట్ సరస్సులో ఈ ఏడాది వలస పక్షుల సందడి కనిపిస్తోంది. సాధారణంగా వేసవిలో పులికాట్ ఎడిపోయి నెర్రెలుబారి ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి దాకా కూడా వానలు కొనసాగడం, వేసవి ముగియక ముందే అడపాదడపా వానలు పడడంతో సరస్సులో అక్కడక్కడా నీటి నిల్వలు చేరాయి. సముద్రపు ఆటుపోట్లకు కూడా సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో చేపా రొయ్యా కదలాడుతున్నాయి. తిండి దొరుకుతుండడంతో స్థానిక రకాల కొంగలతో పాటూ వలస పక్షులు కూడా సరస్సులో కనిపిస్తున్నాయి. ఫ్లెమింగోలు, పెయిటెడ్ స్టార్క్స్, పెలికాన్, నత్తగుల్ల కొంగలు, తెల్లకొంగలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆ కాస్త నీటి చెలమల్లోనే వేటను వెతుక్కుంటున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటూ ఇటూ.. అట్టకానితిప్ప వేనాడు దారి, కొరిడి-పేర్నాడు రోడ్డు, శ్రీహరికోట మొదటి గేటు సమీపంలో బకింగ్ కెనాల్ వద్ద పక్షులు సందడి చేస్తున్నాయి. మత్స్య సంపద దొరుకుతుండడంతో మరోవైపు జాలర్లు కూడా వలలు విసురుతున్నారు. పడవలు తిరుగుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతానికి నైరుతి వానలు కురవవు. ఈశాన్య రుతుపవనాలతో జల్లులు మొదలై తుఫాన్‌లతో కురిసే వానలతో నదులు పొంగి పారుతాయి. చెరువులు నిండుతాయి. పులికాట్ కళకళలాడుతుంది. విచిత్రంగా ఈ వాతావరణం అప్పుడే పులికాట్‌లో కనిపించడం అరుదైన కనువిందు దృశ్యం.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి,

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఎస్‌కేపీసీలో ముగిసిన స్నిగ్ధ పోటీలు



విద్యార్థులతో అతిథులు, కళాశాల నిర్వాహకులు

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో స్నిగ్ధ 2025-2026 పేరిట నిర్వహించిన రెండు రోజుల పోటీలు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించేలా ఈ కళాశాలలో ఆఫ్ స్టేజీ ఈవెంట్లుగా నైల్‌ఆర్ట్, బాటిల్ ఆర్ట్, మండల ఆర్ట్, మోడలింగ్, గ్రూప్ సింగింగ్, అడాప్షన్, ట్యాలెంట్‌షో, గ్రూప్ డ్యాన్స్ పోటీలు నిర్వహించగా, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. కళాశాలకు చెందిన కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త రాధాకృష్ణబాలాజీ పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డా.వనిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.పి.భరణికుమారి, కన్వీనర్ డా.జి.చందన దీప తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో శివమణి



తిరుమల, జూలై10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ప్రసిద్ధ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి దర్శించుకున్నారు. ఇంకా సీనియర్ ఐపీఎస్ అధికారి ఐజీ శ్రీకాంత్ కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

ఈపీఎస్ వ్యాఖ్యలను ఖండిస్తూ

రాజధాని కళాశాల విద్యార్థుల ధర్నా

ప్యారీస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యలను ఖండిస్తూ రాజధాని కళాశాల విద్యార్థులు గురువారం ధర్నా చేపట్టారు. కోవైలో జరిగిన ప్రచార సభలో హిందూ దేవాదాయశాఖ నిధులను కళాశాలల నిర్మాణానికి మళ్లిస్తున్నారని ఈపీఎస్ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ చేపాక్ ప్రాంతంలోని రాజధాని కళాశాల విద్యార్థులు ఈపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



కొరట్టూరులో ఉన్న వివేకానంద విద్యాలయలో గురుపూర్ణిమ సందర్భంగా ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న విద్యార్థులు



గురుపౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఆహ్లాదకర వాతావరణంలో తన ఇష్టవాహనమైన గరుడుడిపై సర్వాలంకార భూషితుడై మలయప్ప స్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడుడిపై గోవిందుడు భక్తులను కటాక్షించారు. . గురుపౌర్ణమి కావడంతో తిరుమల, తిరుపతి స్థానికులతో పాటు భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరి కర్పూర నీరాజనాలతో మలయప్పస్వామిని దర్శించుకున్నారు. వాహనసేవలో కేంద్రమంత్రి బండి సంజయ్, జీయర్‌స్వాములు, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉచిత బస్సుల్లో పెరిగిన మహిళా ప్రయాణికుల సంఖ్య

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'విడియల్ పయనం' పథకంలో ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగిందని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో సాధారణ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించే పథకాన్ని 2021 మేలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకంలో ప్రయాణించే మహిళలకు నెలకు రూ.888 ఆదా అవుతోందని ఓ సర్వేలో తెలిసింది. కాగా, ఎంటీసీ బస్సుల్లో జూన్ వరకు 140.38 కోట్ల సార్లు మహిళలు ప్రయాణించారు. ముఖ్యంగా, జూన్‌లో మాత్రమే 3.69 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా, ప్రతిరోజు సరాసరిన 12.32 లక్షల మంది ఉచితంగా ప్రయాణించారని ఎంటీసీ తెలిపింది.

'హార్ట్ సేవర్' పథకంలో 16,275 మంది లబ్ధి

పెరంబూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ఇదయం కాప్పోం (హార్ట్ సేవర్)' పథకంలో 16,275 మంది లబ్ధి పొందినట్లు ప్రజా ఆరోగ్య శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయి. దీనికి పరిష్కారంగా, రాష్ట్ర ప్రభుత్వం 'ఇదయం కాప్పోం యోజన' పథకాన్ని 2023లో రూ.3.37 కోట్లతో ప్రారంభించింది. గుండెపోటుకు గురైన వారికి మొదటి 60 నిమిషాలు చాలా ముఖ్యమైనది. అలాంటి వారిని దూరంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సమయం పడుతుంది. అందువల్ల, గుండెపోటు నివారించేలా ముందుగా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్ర ఇస్తారు. తదుపరి చికిత్సకు జిల్లా ఆసుపత్రులకు పంపుతుంటారు. ఈ పథకంలో మార్చి వరకు 16,275 మంది ప్రయోజనం పొందారు. 2023 నుంచి ఈ ఏడాది మార్చి వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 15,580 మంది, ద్వితీయ ఆరోగ్య కేంద్రాల్లో 695 మంది గుండెపోటుకు గురైవచ్చిన వారికి గుండెపోటు నివారణ మాత్రలు అందజేసినట్లు ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.



ఎగ్మూరు ప్రభుత్వ మ్యూజియంలో గురువారం ప్రారంభమైన చిత్రలేఖనం, శిల్పకళా ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు.

రాష్ట్రంలో 6 శాతం తక్కువ వర్షపాతం

పెరంబూర్,జూలై10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోనైరుతి రుతుపవనాలతో బుధవారం వరకు ఆరుశాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 69 మి.మీ కాగా, ప్రస్తుతం 64.8 మి.మీ నమోదైంది. అదే సమయంలో రాజధాని నగరం చెన్నైలో నైరుతి రుతుపవన వర్షాలతో 11శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్ లో నగరంలో సాధారణ వర్షపాతం 91.8మి.మీకాగా, ప్రస్తు తం 102.3 మి.మీ వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

వెంకటగిరివాసికి సంత్ కబీర్ అవార్డు

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దేశంలో ఇద్దరిని సంత్ కబీర్ అవార్డుకు ఎంపిక చేసింది. ఇందులో తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన లక్కా శ్రీనివాసులకు సంత్ కబీర్ అవార్డు రావడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ప్రపంచ ఖ్యాతి గణించిన చేనేత చీరలకు ప్రసిద్ధి చెందిన వెంకటగిరి. ఈ ప్రాంతంలో చేనేత రంగంలో ఉన్న వారిలో 12 మంది ఇప్పటికే రాష్ట్రపతి అవార్డును తీసుకున్నారని గుర్తు చేస్తూ, లక్కా శ్రీనివాసులును సన్మానం చేశారు.



లక్కా శ్రీనివాసులును సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు